క్లుప్తంగా

జగనన్న ఆణిముత్యాలు పురస్కారానికి ముగ్గురి ఎంపిక


పి. సుధారాణి


కె. హేమలత


కె. కార్తీక్

ఉంగుటూరు: ప్రభుత్వ విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ చదివి 2023 మార్చి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన వారికి జిల్లాస్థాయిలో ఈ నెల 27న ఏలూరు కలెక్టరేట్‌లో జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు అందజేసి సత్కరించనున్నారు. నారాయణపురంలోని మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని కుమారి పున్నని సుధారాణి సీఈసీ గ్రూపులో 903/1000 మార్కులు సాధించడంతో జిల్లాస్థాయి అవార్డుకు ఎంపికైంది. ప్రశంసాపత్రంతో పాటు రూ.50 వేలు నగదు ఆమెకు అందజేయనున్నారు. కురిటి హేమలత ఎంపీసీ (931), కొరపాటి కార్తిక్ హెచ్ఈసీ (607) నియోజకవర్గస్థాయిలో అవార్డుకు ఎంపిక య్యారు. ఎమ్మెల్యే వాసుబాబు అధ్యక్షతన నిర్వహించనున్న జగనన్న ఆణిముత్యాలు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈనెల 25న నియోజకవర్గం స్థాయి అవార్డులకు ఎంపికైన విద్యార్థులను సత్కరించి పురస్కారాలు అందజేయన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసు అవార్డులకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

మొక్కలు నాటిన నాయకులు

పెదవేగి : రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించి మంగళవారానికి నాలుగేళ్లు పూర్తయిందని ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ అన్నారు. రాక్షస పాలనను అంతమొందించి దెందులూరు నియోజకవర్గంలో సంక్షేమ పాలనకు పునాది పడి స్థానికంగా ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరి గెలిచిన రోజు నియోజకవర్గంలో సంబరాలు మిన్నంటాయని గుర్తు చేశారు. మంగళవారం ఉదయం పెదవేగి మండలం రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి దేవస్థానాన్ని దర్శించుకున్న నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీపురం మార్కెట్ యార్డ్‌లో సంక్షేమ పాలనకు ప్రతీకగా ఏఎంసీ చైర్మన్ మొక్కలు నాటి, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ రైతు సంఘ నేత ఆళ్ళ సతీష్‌చౌదరి, రైతులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ గంగాధరరావు ఆకస్మిక మృతి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రిటైర్డ్ సర్వశిక్షాభియాన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఇంటేటి గంగాధరరావు (47) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన సతీమణి ఇంటేటి మధులత ప్రస్తుతం వైఎస్సార్ సీపీ కొవ్వలి సర్పంచ్‌గా ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చిన గంగాధరరావు అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఇటీవల వలంటరీ రిటైర్డ్‌మెంట్ ఇచ్చారు. విషయం తెలుసుకున్న వెంటనే వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని గంగాధర్ ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, పార్టీ జిల్లా కార్యదర్శులు గొల్ల వీరాస్వామి, ఎంపీటీసీ జి. వరలక్ష్మి పరామర్శించిన వారిలో ఉన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

పెదపాడు: పేకాట ఆడుతున్న 8మందిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు మంగళవారం తెలిపారు. వీరభద్రపురంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై బీ నాగబాబు తన సిబ్బందితో కలిసి దాడి చేసారు. ఈదాడిలో 8 మంది వద్ద ఉన్న రూ.7,100 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

యువతి ఆత్మహత్య

ఉంగుటూరు: రావులపర్రు గ్రామంలో యువతి ఆత్మహత్య కేసులో నిందితుడిగా అనుమానిస్తున్న అదే గ్రామానికి చెందిన జలసూత్రం శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనివాస్ ప్రేమ పేరుతో వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో మలికి భవాని (21) మనస్థాపానికి గురైంది. తల్లిదండ్రులు లేని సమయంలో ఆమె ఈనెల 12న ఇంటి రేకుల షెడ్డుకు ఉరివేసుకుంది. ఈ ఘటనపై చేబ్రోలు ఎస్సై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు జలసూత్రం శ్రీనివాసును మంగళవారం అరెస్టు చేసి తాడేపల్లిగూడెం ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరపర్చారు. నిందితుడికి రిమాండు విధించినట్లు ఎస్సై వివరించారు.

నకిలీ పట్టా జారీపై విచారణ

దెందులూరు: పోతునూరు గ్రామంలో నకిలీ పట్టా మంజూరుపై విచారణ ముగిసింది. పోతునూరుకు చెందిన వీరబాపూజీ నకిలీ పట్టా జారీ, వీఆర్‌ఓలు, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్లపై లిఖితపూర్వకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఆర్‌డీఓ పెంచల కిషోర్, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్యకు స్పందనలో ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. పోతునూరులో వీఆర్‌ఓలుగా పనిచేసిన చంద్రం, శ్రీనివాసరావు, నాగరాజును తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు. నివేదికను ఆర్‌డీఓకు అందజేశామని తహసీల్దార్ తెలిపారు.

ప్రజలకు, ప్రభుత్వానికి సంక్షేమ వారధులు వలంటీర్లు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- మండలవర్రులో అట్టహాసంగా వలంటీర్లకు వందనం


వలంటీర్లకు పురస్కారాలు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: ప్రజలకు ప్రభుత్వానికి సంక్షేమ వారథులుగా గ్రామ వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం మండలపర్రులోని గాదిరాజు గోపాల కృష్ణంరాజు కల్యాణ మండపంలో మండలస్థాయిలో వలంటీర్లు సేవలకు గుర్తింపుగా వలంటీర్లు వందనం కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పేరుతో మూడు కేటగిరిల్లో ఎంపికైన వలంటీర్లకు ఎమ్మెల్యే వాసుబాబు పురస్కారాలు అందించారు. సేవా వజ్రగా గణసల నాగరాణి (తోకలపల్లి), సేవా రత్నగా నీతిపూడి కరుణకుమార్ (అడవికొలను), కొమ్మన నాగరాజు (బువ్వనపల్లి), ప్రసన్న వరకాంతి (పత్తేపురం), ఇంజుమూరి మంజు (క్రొవ్విడి)కి పురస్కారాలు అందించారు. మిగిలిన వారికి సేవా మిత్రగా అవార్డులు ఎమ్మెల్యే వాసుబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మానస పుత్రిక వలంటీరు వ్యవస్థ అన్నారు. లంచాలకు తావులేకుండా, వివక్ష లేకుండా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందించడంలో వలంటీర్లు కీలకమన్నారు. 1వ తేదీన సూర్యుడు ఉదయించకుండానే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పెన్షన్లు అందిస్తున్న గొప్ప సేవకులు, సైనికులు వలంటీర్లు అని అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల అమలులో బ్రాండ్ అంబాసిడర్లు రాష్ట్రంలో వలంటీర్లు ఉన్నారన్నారు.

వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శం

జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీరు వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, డీఎల్‌టీఓ రమణ, ఎంపీడీవో పీవీవీ ప్రకాష్, వైస్ ఎంపీపీలు సమయం వీరరాఘవులు, బండి రమణవిస్సాకు, సర్పంచ్ దెందుకూరి సూర్యకాంతం, ఎంపీటీసీ ముదునూరి త్రివేణి, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, వలంటీర్లు హాజరయ్యారు.

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే 'గడపగడపకు'


లబ్ధిదారులకు స్థల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం చేపట్టినట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం పెదనింద్రకొలనులో 160వ రోజు గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుబాబుకు గ్రామస్తులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో, హారతులతో ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌కు అందరూ ఆశీస్సులను అందించాలని కోరారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించేందుకే గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసారన్నారు. ఈ సందర్భంగా 160 వరకూ గడపల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేసారు.

68 మందికి ఇంటి స్థల పట్టాల పంపిణీ

ముందుగా నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఎంపికైన 68 మంది పెదనింద్రకొలనులోని లబ్ధిదారులకు వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇంటి స్థల పట్టాలు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అందించారు. రూ.7 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను వాసుబాబు శంకుస్థాపన పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, గ్రామా పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, సర్పంచ్‌లు ముగ్గళ్ల యాకోబు, వైస్ ఎంపీపీలు బండి రమణ విస్సాకు, ఎంపీటీసీ చినమిల్లి నరసిహమూర్తి, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివ, మాజీ సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న సుబ్బరాజు, వైసీపీ నేతలు పుప్పాల సుబ్బారావు, అల్లాడి శేషారత్నం, ఎం సుబ్బారావు, విప్పర్తి మధు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలాయగూడెంలో గడపగడపకు..

దెందులూరు: గాలాయగూడెంలో నేటి నుంచి మూడు రోజుల పాటు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధ, గురు, శుక్ర వారాల్లో మూడు రోజులు సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటానని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

వైఎస్సార్ కంటివెలుగులో వృద్ధులకు వైద్య పరీక్షలు

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వృద్ధులు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని గణపవరం మండలం చిలకంపాడు సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు. 61 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- డ్వాక్రా సంఘాల మహిళలతో ముఖాముఖి


స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : మహిళలు అన్ని రకాలుగా ఆర్థిక స్వాలంబన సాధించి అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం డ్వాక్రా సంఘాల మహిళలతో ఎమ్మెల్యే మంగళవారం ముఖాముఖి నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలతో నేరుగా సమావేశమై వారి అవసరతలు తెలుసుకుని, పరిష్కరించే దిశగా సమావేశం ఏర్పాటు చేయడంపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొప్పులవారిగూడెం సచివాలయ పరిధిలో 53 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, వైఎస్సార్ ఆసరా 35 స్వయం సహాయక సంఘాలకు రూ 90. 75 లక్షలు ప్రభుత్వం అందించామని అబ్బయ్యచౌదరి అన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ 2019–20 సంవత్సరంలో పొందిన 32 స్వయం సహాయక సంఘాలకు రూ.5.41 లక్షలు, 2020–21లో 40 గ్రూపులకు రూ.6.49 లక్షలు, 2021–22లో 42 గ్రూపులకు రూ.7.45 లక్షలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే మహిళలకు వివరించారు. అనంతరం ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే చెప్పమని ఎమ్మెల్యే బహిరంగంగా మహిళలను కోరారు. అందులో కొంతమంది ఇంటి రుణాలు, స్థలాలు ఇలా పలు అవసరతలు, పథకాలపై అబ్బయ్యచౌదరిని వేడుకున్నారు. దీనిపై తక్షణం స్పందించిన ఆయన వెంటనే పేర్లను నమోదు చేసి, త్వరితగతిన ప్రతి ఒక్కరికీ అన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సభా ముఖంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, పెదవేగి సొసైటీ చైర్మన్ పెనుమాక వెంకట సుబ్బారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, సర్పంచ్ చలపాటి మణి సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ కొరసిక గంగారత్నం పుష్పవతి, బలుసు శ్రీధర్, గ్రామపార్టీ అధ్యక్షుడు తానంకి విష్ణు, ఎంపీటీసీ యర్రా సలోమి వెంకటరత్నం, చలపాటి నాగేశ్వరరావు, బలుసు కిషోర్, వీరంకి సుబ్బారావు, బలుసు రామదాసు, ఎం చిన్ని, ఇతర ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, ఏపీఎం బట్టు శరత్‌బాబు, సీసీలు కె స్రజన, డ్వాక్రా సీఏలు బేబి, ధనలక్ష్మీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జోరుగా మట్టి తవ్వకాలు

ఉంగుటూరు: మట్టి తవ్వకాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ అధికార్లకు భయపడి రాత్రి సమయాల్లో మాత్రమే వ్యాపారులు మట్టి తవ్వుకుంటున్నారు. గోపినాథపట్నం రెవెన్యూ పరిధిలో సోమ, మంగళవారాలు తవ్వకాలు జోరుగా సాగాయి. మెట్టప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో డెల్టాలోని కొన్ని గ్రామాల్లో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. చేబ్రోలు ఆయకట్టులో మట్టి తవ్వకాలను నిలుపుదల చేసి మైనింగు అధికార్లు పట్టుకుని వదిలేసినట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు మట్టి అమ్మకాలు జోరుగా సాగిస్తున్నారు. తహసీల్దారు పోతురాజు మాట్లాడుతూ ఫిర్యాదు అందిన వెంటనే తవ్వకాలు నిలుపుదలకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల వీఆర్వోల సమావేశం నిర్వహించి రెవెన్యూ ఉద్యోగులను అప్రమత్తం చేశామని వివరించారు.

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శనీయం


వలంటీర్లను సత్కరించిన కామిరెడ్డి నాని, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ లక్ష్మి

దెందులూరు: వలంటీర్లు సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రజాప్రతినిధులుగా ప్రమాణస్వీకారం చేసిన రోజున విశిష్ట సేవలందించిన గ్రామ వాలంటీర్లకు ప్రభుత్వం పురస్కారం అందించడం తనకెంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. మంగళవారం శ్రీరామవరం గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్ల వ్యవస్థ ద్వారా లాభాపేక్ష లేకుండా సేవా గుణంతో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వలంటీర్లు సేవలందిస్తున్నారన్నారు. ఏటా ప్రభుత్వం ఇచ్చే నగదు ప్రోత్సాహకంతో పాటు వ్యక్తిగతంగా తాను ప్రతి వలంటీర్‌కు రూ. 5 వేలు అదనంగా ఇస్తున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, కన్వీనర్లు, సమన్వయంతో వైఎస్సార్ సీపీ విజయానికి అంకితభావంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. శ్రీరామవరం, దెందులూరు మండల అభివృద్ధికి, సంక్షేమానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం జగన్ అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి మాట్లాడుతూ వలంటీర్లు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. వలంటీర్లు నీలాపు శివకుమార్, మోర్ల శిరీష, నీలాపు సాయికుమార్, బోడవరపు గాంధీ, కొత్తపల్లి జ్యోతి, చిలకా సాయిప్రసాద్, కొత్తపల్లి వెంకటరమణ, తాడిగడప మైనలతో పాటు వారి కుటుంబ సభ్యులను వేదికపై పిలిచి ప్రభుత్వం తరపు నుంచి షీల్డ్, ప్రశంసాపత్రం, నగదు, శాలువాలతో సత్కరించారు. కామిరెడ్డి నాని, తహసీల్దార్, ఎంపీడీఓ, జోగన్నపాలెం సొసైటీ చైర్మన్ పాకలపాటి వాసు, పంచాయతీ ఉపసర్పంచ్ కనమూరి సావిత్రి, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, వీఆర్‌ఓ కృష్ణకుమారి, వార్డు మెంబర్లు కామిరెడ్డి బాలు, ప్రతాప్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ బృందం




పీహెచ్‌సీలో సమావేశంలో మాట్లాడుతున్న సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టి.యన్.స్నేహన్, పాల్గొన్న వైద్య సిబ్బంది

పెదవేగి : ప్రజలందరికీ ఆరోగ్యం అందించేందుకు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ప్రభుత్వం గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసిందని సచివాయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా కోఆర్డినేటర్ టి.యన్.స్నేహన్ చెప్పారు. మంగళవారం పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ఇ.వి.ఎల్. మాధవి అధ్యక్షతన గ్రామస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్నేహన్ మాట్లా డుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకోసం గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి టీం లీడర్‌గా 5 సభ్యులతో ఈ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైందని చెప్పారు. ఈ టీం ప్రతి నెలా సమావేశమైన గ్రామాల్లో ప్రజల ఆరోగ్యంపై చర్చించుకుని అందరికీ ఆరోగ్యం అందేలా చూడాలన్నారు. ప్రధానంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సు బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. యుక్త వయసు బాలికలకు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయాలన్నారు. ఇవన్నీ సక్రమంగా నిర్వహించేందుకు గ్రామస్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ ఏర్పాటు చేయా లని జి.ఓ నంబర్ 34 జారీ అయ్యిందని చెప్పారు. దీని ప్రకారం వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలోని సామాజిక ఆరోగ్య అధికారి లీడర్‌గా ఉన్న కమిటీలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్త, పాఠశాల ఆరోగ్య అంబాసిడర్, గ్రామ సంఘం అధ్యక్షుడు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రజలకు ఆరోగ్య పరిస్థితులు మెరుగుపర్చటం, అనారోగ్య వంతులకు సేవలు చేయటంలాంటి పనులు ఈ కమిటీ చూడాలన్నారు. అందుకోసం ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి చర్చించాలని చెప్పారు. ఈ కమిటీలు సమావేశాలు నిర్వహించేలా మెడికల్ ఆఫీసర్ సమన్వయం చేయాలన్నారు. ఈ విధంగా ప్రజలకు ఆరోగ్యం అందించి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆలోచనమేరకు రక్తహీన రహిత జిల్లాగా మార్చటానికి ప్రతి ఒక్కరం అంకిత భావంతో పనిచేయాలని హితవు పలికారు. అనంతరం మండలంలోని వెంకట కృష్ణాపురం, దిబ్బగుడెం అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. గర్భిణులు రక్త పరీక్షలు నిరంతరం చేయాలన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మాధవి, గ్రేడ్ వన్ సామాజిక ఆరోగ్య అధికారి డి.రోజ్ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్లు కె.మురళీ మోహన్, ఏ.వి.యామిని, గ్రామ సామాజిక ఆరోగ్య అధికారులు, ఏ.ఎం.ఎం. లు, మేల్ హెల్త్ అసిటెంట్లు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పిల్లలకు నీతి కథలు


ఉంగుటూరు శాఖాగ్రంథాలయంలో నీతి కథలు బోధిస్తున్న రిసోర్సు పర్సన్ అప్పారావు

ఉంగుటూరు: వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణలో భాగంగా ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో పిల్లలకు నీతి కథలు బోధించారు. 16వ రోజు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రిసోర్సు పర్సన్ అప్పారావు విద్యార్థులకు నీతి కథలు చదివించడం, కథలు వినిపించడం, పుస్తక సమీక్ష తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. విద్యార్థులతో యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథపాలకుడు గంగాధరరావు పర్యవేక్షించారు.

జ్ఞానాన్ని పంచే కేంద్రాలు గ్రంథాలయాలు

భీమడోలు: విద్యార్థులను ప్రజ్ఞావంతులుగా తీర్చి దిద్దేవి గ్రంథాలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శిక్షణ తరగతులు ఉల్లాసవంతమైన వాతావరణంలో సాగాయి. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన చిన్నారులు ఉత్సుకతను ప్రదర్శించారు. పుస్తక పఠనం చేసారు. యోగాసనాలపై తర్ఫీదు ఇచ్చారు. భీమడోలు, పూళ్లల్లో యోగా నిపుణులు భావనారుషి, కురెళ్ల కిషోర్ శిక్షణ అందించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ నీతి కథలు వివరించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు స్కూలు అసిస్టెంట్ ఉపాధ్యాయుల ఫణికుమార్ జీకే, గణితంపై మెలకువలు అందించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులు పుస్తక పఠనం, యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాఠకులు, సిబ్బంది, బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.